క్లుప్తంగా

జాంకారమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



కిండంగిలో జాంకారమ్మ రాతి విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: మండలంలోని కిండంగి పంచాయతీ గిరిజనుల ఆరాధ్యదైవం జాంకారమ్మతల్లికి ఆదివారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కిండంగి, సేరిబయలు, నక్కలపుట్టు గ్రామాలకు చెందిన గిరిజనులంతా కొండమీద జాంకారమ్మ గుడి వరకు మట్టి ఘటాలను మోసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటి పండగలతో కిండంగి పంచాయతీలోని గిరిజన కుటుంబాలు సందడి చేశాయి.

పూర్వ విద్యార్థుల బాసట



కుమారికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలిచారు. రెండు రోజుల క్రితం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తోటి స్నేహితుల గురించి ఆరా తీశారు. ఈ నేపథ్యంలో వట్టిగెడ్డ గ్రామానికి చెందిన తమ సహచర విద్యార్థి లోకారపు లోవరాజు అనారోగ్యంతో చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలుసుకున్నారు. ఈ మేరకు ఆదివారం వారంతా స్నేహితుని భార్య కుమారికి స్థానిక పాఠశాల ప్రాంగణంలో రూ. 20 వేలు అందజేశారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించాలని ధైర్యం చెప్పారు. చింతలపూడి రాజా, నాగేంద్ర బాబు, మాడా వరలక్ష్మి, వినోద్, ఏసెబు, శివ, రాధాకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుడి తొలగించి.. విగ్రహాన్ని పడేశారు!



గుడి మెట్ల వద్ద నిరుపయోగంగా సాయిబాబా విగ్రహం

చింతపల్లి రూరల్: భక్తుల నుంచి పూజలందుకోవాల్సిన సాయిబాబా విగ్రహం స్థానిక కొండపై గుడి మెట్ల దగ్గర నిరుపయోగంగా మారింది. ఎన్‌హెచ్ 516ఇ విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు పక్కన సాయిబాబా గుడిని తొలగించారు. బాబా విగ్రహాన్ని ఇక్కడ దగ్గర్లోనే కొండపై సాయిబాబా గుడి మెట్ల వద్ద పడేశారు. దీంతో భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కమిటీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

భగవద్గీత చదివించండి



తోటాడలో కరపత్రాల పంపిణీ

మునగపాక : ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని ఆదినారాయణ స్వామి రాజ యోగాశ్రమం ట్రస్టీ కుమార్ కోరారు. మండలంలో గల తోటాడ గ్రామంలో ఆదివారం రాజ యోగాశ్రమం ఆధ్వర్యంలో భగవద్గీతపై అవగాహన కల్పించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు కూడా పిల్లలను భగవద్గీతపై శిక్షణను పోత్సహించాలన్నారు. తద్వారా పిల్లల్లో మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో చవిటిదిబ్బలు



చవిటిదిబ్బలు నుంచి బండిగడ్డ గ్రామానికి నిర్మించిన బీటీరోడ్డు



నూతన సీసీ రోడ్డు



చవిటిదిబ్బలులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం

- ఇంటింటికీ కుళాయిలు
- వీధివీధికి సీసీరోడ్డు
- గ్రామంలోనే ప్రభుత్వ సేవలు
- రూ.5 కోట్లతో బీటీరోడ్డు, వంతెనలు నిర్మాణం
- అన్ని రకాలుగా అభివృద్ధి

వై.రామవరం: దశాబ్దాలుగా అభివృద్ధి అంటే తెలియని చవిటిదిబ్బలు పంచాయతీ నేడు ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో వీధివీధికి సీసీరోడ్లు, నాణ్యమైన తారు రోడ్లు, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, గ్రామంలోనే ప్రభుత్వ సేవలు, ఇలా ఒకటేమిటి అనేక రకాలుగా మేలు చేకూరింది. దాంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చవిటిదిబ్బలు పంచాయతీ పరిధిలో పూతిగుంట, తేనికొండ వీధి, తోటకూరపాలెం, చవిటిదిబ్బలు గ్రామాలు ఉన్నాయి. ఆ పంచాయతీలో మొత్తం 3,500కుపైగా జనాభా, 1700పైగా ఓటర్లు ఉన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో పూతిగుంటలో రూ.10 లక్షలతో సోలార్ మంచినీటి పథకం, చవిటిదిబ్బలులో రూ. 22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.42 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించారు. రూ. 90 లక్షలతో పూతిగుంట, చవిటిదిబ్బలు, తోటకూరపాలెం గ్రామాల్లో సీసీరోడ్లు వేశారు. తేనికొండ వీధికి రూ.6 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. గ్రామంలోని ప్రతీ కుటుంబం లక్ష రూపాయల వరకు ఆసరా, రైతు భరోసా, అమ్మఒడి, చేయూత, తదితర పింఛన్లు వంటి అనేక జగనన్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారు. తోటకూరపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని రూ.25 లక్షల నాడు–నేడు నిధులతో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అదే గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను రూ.10 లక్షలు నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేశారు. ఆయా పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించారు. ఆయా గ్రామాల్లో రూ.50 లక్షలతో మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి ఇంటింటా కుళాయిల సౌకర్యం కల్పించారు. చవిటిదిబ్బలు నుంచి బండిగడ్డ గ్రామానికి రూ.5 కోట్లతో 7 కిలోమీటర్ల మేర బీటీరోడ్డును, రెండు కొండవాగులపై వంతెనలు నిర్మించారు. దీంతో 15 లోతట్టు గ్రామాలకు ప్రధాన రహదారికి దగ్గరలో రోడ్డు సౌకర్యం ఏర్పడింది. ఆయా గ్రామాల ప్రజలు గత టీడీపీ హయాంలో రహదారి లేక అష్టకష్టాలు పడేవారు. జగనన్న ప్రభుత్వ హయాంలో తమ పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తోటకూరపాలెంలో నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేసిన ఎంపీపీ పాఠశాల



రైతు భరోసా కేంద్రం



చవిటిదిబ్బలు పంచాయతీ తోటకూరపాలెంలో నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేసిన కేజీబీవీ

అన్ని రకాల సంక్షేమ లబ్ధి పొందాం



జగనన్న ప్రభుత్వ హయాంలో చవిటిదిబ్బలు పంచాయతీ ఎంతో అభివృద్ధి చెందింది. గ్రామస్తులందరం అన్ని రకాల సంక్షేమ పథకాలు లబ్ధి పొందాం. మా కుటుంబానికి రూ.లక్ష వరకు లబ్ధి చేకూరింది. మరిన్ని సంక్షేమ పథకాలు లబ్ధి పొందడానికి తిరిగి జగనన్ననే ముఖ్యమంత్రిగా చూడాలన్నది మా కోరిక. కచ్చితంగా చూస్తామన్నదే మా నమ్మకం.

– గేదెల కాంతం, చవిటిదిబ్బలు గ్రామం, వై.రామవరం మండలం

మరింత అభివృద్ధి చేస్తాం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అభివృద్ధి చూడలేకపోయాం. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అనేక పనులకు నిధులు మంజూరు చేయడంతో, ఎంతో అభివృద్ధి సాధించాం. నా సర్పంచ్ పదవికి న్యాయం చేకూర్చాను. తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని మా నమ్మకం. జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే మరింత అభివృద్ధి సాధించడానికి సిద్ధంగా ఉన్నాం.

– బచ్చలి చిన్నమ్ములు, సర్పంచ్, చవిటిదిబ్బలు పంచాయతీ, వై.రామవరం మండలం

జై హనుమాన్



మన్యంలో ప్రతిష్ఠించిన హనుమ విగ్రహం

- ఏడేళ్లలో 734 హనుమాన్ విగ్రహాల ప్రతిష్ట
- వెయ్యి ప్రతిష్టించాలని లక్ష్యం
- సద్గురు సేవాశ్రమం వ్యవస్థాపకుడు అప్పలరాజు ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ట



చేపలుప్పాడలో ప్రతిష్ఠించిన సాయిబాబా, ఆంజనేయుని విగ్రహాలు



రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు నిడిగట్టు సమీపంలోని రామయోగి అగ్రహారం గ్రామానికి చెందిన సద్గురు సేవాశ్రమం వ్యవస్థాపకుడు కోన అప్పలరాజు అలియాస్ యోగారాజు ఏడేళ్ల పాటు అలుపెరగకుండా 734 హనుమాన్ విగ్రహాలు ప్రతిష్టించారు. వీటిలో 650కు పైగా విగ్రహాలు విశాఖ ఉమ్మడి జిల్లా మన్యంలోనే ప్రతిష్ఠించారు. ఇవి పాడేరు, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, హుకుంపేట, అరకు, పెదబయలు, చింతపల్లి, అనంతగిరి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, కేడీ పేట, కొయ్యూరు మండలాలతో పాటు ఒడిశాలోని మల్కన్‌గిరి కోరాపుట్ జిల్లాల్లో కూడా మారుతి విగ్రహాల ప్రతిష్ట ద్వారా గిరిజనులలో భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. దాతల సాయంతో కొనసాగుతున్న ఈ మహాయజ్ఞం వెయ్యి విగ్రహాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో యోగా రాజు ముందుకు సాగుతున్నారు. వీటి కోసం ఆయన ఇప్పటి వరకు రూ.2.50 కోట్లు మించి ఖర్చు చేసినట్టు అంచనా. కేవలం ఆంజనేయుని విగ్రహాలే కాకుండా వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయి, శివపార్వతులు, గణపతి తదితర విగ్రహాలు, వాటికి ఆలయాలు నిర్మిస్తున్నారు. రెండేళ్ల క్రితం అల్లూరి జిల్లా జి.మాడుగులలో రూ.50 లక్షలతో 15 అడుగుల పంచముఖ ఆంజనేయుని విగ్రహంతో పాటు ఆలయాన్ని నిర్మించారు. ఇకపై మైదాన ప్రాంతాలకు కూడా ఈ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. మన్యంలోని మారుమూల గ్రామాలైన తమ్మింగల, భీమనపల్లి, సోమవరం, ఉకురుబ, ములుసోబ, కొరాపల్లి, వందనపల్లి, వట్టివెగిన, సాడీకు, గెమ్మిలి, అన్నవరం వంటి గ్రామాలు కూడా ఉన్నాయి. గ్రామ జనాభాను బట్టి 3 నుంచి 15 అడుగుల రాతి, సిమెంట్ విగ్రహాలు ఇందులో ఉన్నాయి. వీటి కోసం రూ.10 వేల నుంచి రూ.లక్షలలో ఖర్చు చేస్తున్నారు. అదనంగా ఆలయాల నిర్మాణానికి మరిన్ని నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇతర ఆలయాలు ఉన్నచోట అనుబంధంగా భజరంగబలి విగ్రహాలు అందిస్తున్నారు. అంతేకాకుండా భీమిలి పరిధిలోని అన్నవరం, చేపలుప్పాడ, కాపులుప్పాడ, నిడిగట్టు చుట్టుపక్కల గ్రామాల్లో పదుల సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటు చేస్తూనే ఉన్నారు. అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో రూ.1.50 లక్షలతో నిర్మించిన 15 అడుగుల విగ్రహం పెద్దది. 2017 ఏప్రిల్‌లో అక్షయ తృతీయ రోజు తండ్రి కుంచయ్య జ్ఞాపకార్థం 9 అడుగుల మొదటి విగ్రహాన్ని హుకుంపేట మండలం సుకురుపేట పంచాయతీ రాళ్లగడ్డలో ప్రతిష్ఠించారు.

రాళ్లకు ప్రత్యామ్నాయంగా..

మన్యంలోని మారుమూల గ్రామాల్లో ఆలయాలు తక్కువగా ఉండటంతో గిరిజనులు రాళ్లను పూజిస్తుంటారు. దీంతో వారి కోరిక మేరకు ప్రతిష్ఠించిన విగ్రహాలు వందలకు చేరుకుని వెయ్యి విగ్రహాల లక్ష్యంగా సాగుతోంది. విగ్రహాలు కావలసిన వారు నాలుగు అడుగుల ఎత్తులో 6×6 విస్తీర్ణంతో దిమ్మె నిర్మించుకుంటే సేవాశ్రమం నుంచి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. కేవలం ఆంజనేయుని విగ్రహాలే కాకుండా హుకుంపేట మండలం మద్దివీధిలో రూ.3.50లక్షలతో శివాలయం పునఃప్రతిష్ట, ములుసోబలో అయిదడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ఇంట్లో పూజలకు అడుగు సైజు రాతి ఆంజనేయుని విగ్రహాలు ఇస్తున్నారు. విగ్రహం ప్రతిష్ఠించిన రోజు స్థానికులు అన్నదానాలు ఏర్పాటు చేసుకుంటున్నారని అక్కడకు హాజరైన వారికి ఆశ్రమం తరపున రామకోటి పుస్తకాలు, ఆంజనేయుని చిత్రపటాలు, దుప్పట్లు, చీరలు, స్టీలు కంచాలు అందిస్తున్నామన్నారు. విగ్రహాల తయారీ ఏజెన్సీ ముఖద్వారమైన చోడవరం, వడ్డాది, ఆర్లాపురం, ముకుందపురం, రాజమండ్రిలలో చేపట్టి ఇక్కడ నుంచే అతి కష్టంమీద వాహనాలలో ఏజెన్సీకి తరలిస్తుంటారు.

నిత్య సేవకుడు యోగారాజు

ఏజెన్సీలో 500 దేవాలయాలకు విడతకు రూ.2.25 లక్షల వంతున పూజాసామగ్రి ఆశ్రమం తరపున పంపిణీ చేశారు. భీమిలి మండలం చేపలుప్పాడలో షిర్డీసాయిబాబా విగ్రహం, రామయోగి అగ్రహారంలో షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం, నూకాంబిక, శ్రీకృష్ణులకు మందిరాలు నిర్మించారు. ఇక్కడే వంద వరకు దేశీయ ఆవులతో గోశాల, 60 మంది వృద్ధులకు ఉచితంగా ఆశ్రయం కల్పించారు. విజయసాయి యోగా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా యోగాలో ఉచిత శిక్షణ, నేత్ర వైద్యశిబిరాలు, తాగునీటి కొరత ఉన్నచోట బోర్ల తవ్వకాలు, వంటపాత్రలు పంపిణీ చేస్తున్నారు. గతంలో చింతపల్లి, రోలుగుంట గ్రామాల్లో రూ.1.25 లక్షలతో మోటార్లు, పైపులైన్, టాంకర్ల ద్వారా అక్కడి ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించారు.



ప్రతిష్టించడానికి సిద్ధంగా హనుమ విగ్రహం



జీకే వీధి రింతాడ వద్ద నిర్మించిన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు

వెయ్యి విగ్రహాలు పూర్తి చేస్తాం



విజయప్రధాత అంజనిసుతుని ఆశీస్సులతో వెయ్యి విగ్రహాలు పూర్తి చేయడమే లక్ష్యంగా దాతల సాయంతో ముందుకు వెళ్తున్నాం. విగ్రహాలు కావలసిన వారు 98486 49067, 85005 09067 నంబర్లలో సంప్రదించవచ్చు.

– యోగా రాజు

ఇథలిన్ వాయువుతోనే పండ్లు మగ్గబెట్టాలి

- ఉద్యానశాఖ అధికారి రాధిక



పెందుర్తి: మామిడి పండ్లను కాల్షియం కార్బైట్ సహాయంతో మగ్గబెట్టడం మంచిది కాదని ఉద్యాన శాఖ అధికారి జి.రాధిక అన్నారు. దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను ఇథలిన్ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. పక్వానికి వచ్చిన మామిడి కాయలను గాలి చొరబడకుండే ఉండే గదిలో ఉంచి ఇథలిన్ వాయువు 2 పీపీహెచ్‌ను స్ప్రే చేసి 16 గంటల తర్వాత తీస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయన్నారు. లేదా బకెట్ నీటిలో ఇథలిన్ ద్రావణం, క్లాస్మిక్ సోడా కలిపి చల్లిన తర్వాత 24 గంటలు ఉంచాలన్నారు. దీని వల్ల ఇథలిన్ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయని చెప్పారు. ఎట్టిపరిస్థితిలోనూ ప్రభుత్వం నిషేధించిన కాల్షియం కార్బైట్ వాడరాదని స్పష్టం చేశారు.

భారీ ప్రభ ప్రదర్శన



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా ఆదివారం భారీ ప్రభను ఏర్పాటు చేశారు. ఐదేళ్లకోసారి నిర్వహించే అమ్మవారి పెద్ద పండగకు అమ్మవారి వివిధ రూపాలతో కూడిన భారీ ప్రభలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఈసారి కూడా దాదాపు 50 అడుగుల ఎత్తైన ప్రభను అమ్మవారి చిత్రాలతో తయారు చేశారు. దీన్ని గ్రామ పెద్దలు, భక్తులు గ్రామంలో నిలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

తెలుగు, ఇంగ్లిష్‌పై పట్టు పెంచుకోవాలి



చినదొడ్డిగల్లులో పుస్తకపఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : తెలుగు, ఇంగ్లిష్ భాషలపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటరమణ, సిహెచ్. సతీష్ కోరారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై పలు సూచనలు చేశారు. చిన్న చిన్న పదాలను రాయడం, చదవడం ద్వారా ఇంగ్లిష్ సులభంగా నేర్చుకోవచ్చన్నారు. ఇంగ్లిష్ భాషపై పరిజ్ఞానం పెంచుకుంటే పోటీ పరీక్షలను ఎదుర్కోవడం ఎంతో సులభమన్నారు. దీన్ని గుర్తించి జగనన్న ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలుగు భాషలో నేర్చుకోవాల్సిన మెలకువలను ఉపాధ్యాయుడు సతీష్ తెలియజేశారు. పద్య పఠనం, పుస్తక పఠనం ద్వారా ఈ రెండు భాషలపై పట్టు సాధించవచ్చన్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం గ్రంథాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసిన గ్రంథాలయాధికారి జనార్దన్‌ను వారు అభినందించారు. ఇక్కడ వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలతో పాటు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలు, ప్రపంచం నలుమూలలా ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంగ్లిష్ పత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని, గ్రామర్‌పై పట్టు సాధించాలని వారు సూచించారు.

నేచురోథెరపీతో ఆరోగ్య సంరక్షణ

చోడవరం రూరల్: వ్యాధులు సోకిన తర్వాత మందులు వాడుతూ కలత చెందడం కన్నా వ్యాధులు రాకుండా శరీరాన్ని సంరక్షించుకోవడమే నేచురో థెరపీ విధానమని ఆక్యుపంక్చర్ థెరపిస్టు డా.గొట్టివాడ బాస్మిలా తెలిపారు. ఆదివారం స్థానిక వాకర్స్ క్లబ్ భవనంలో నేచురో థెరపీ, ఆక్యుపంక్చర్ వైద్య విధానం పట్ల అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాభ్యసన, ఓంకారం పఠనం, ధ్యానం వంటివి దైనందిన జీవనంలో ఓ భాగంగా మార్చుకోవాలని సూచించారు. రోజూ వీటిని చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు న్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పూర్వ అధ్యక్షుడు చిరికి దేవానంద్, విశ్రాంత ఈవోపీఆర్డీ ఆర్.కన్నంనాయుడు, కె.సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. సుగ్గు అప్పలరాజు, ఎ.శ్రీనివాస్ లు డాక్టర్ బాస్మిలాకు జ్ఞాపికను అందించి, సత్కరించారు.

యోగాసనాలతో ఆరోగ్యం

అనకాపల్లి: ఆహారం తీసుకున్నంత కాలం ఆసనాలు, ప్రాణం ఉన్నంత వరకూ ప్రాణాయా మం చేయాలని పతంజలి హరిద్వార్ తెలుగు ఉమ్మడి రాష్ట్రాల పర్యవేక్షకులు స్వామి రితిదేవ్ మహారాజ్‌జీ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం పతంజలి వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకున్న వ్యక్తులకు శిక్షకులుగా వెళ్లవచ్చని పేర్కొన్నారు. దేశంలో సంస్కృతి సంప్రదాయాలు కాపాడడానికి పంతంజలి హరిద్వార్ భారతీయ శిక్షణ బోర్డు కృషిచేస్తుందన్నారు. కరోనా సమయంలో తక్కువ ఖర్చుతో పతంజలి హరిద్వార్ ఆయుర్వేదిక్ మందులు తయారుచేసి ఎంతో మందిని కాపాడిందన్నారు. యోగా సభ్యులు, జార్జిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.